

● చెరువు చెత్తమయం



మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామ సమీపంలో ఉన్న గండిపేట చెరువు కలుషిత మవుతోంది. నగరానికి దాహార్తిని తీర్చే ఈ చెరువు చెత్తచెదారంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. ప్రజల అవగాహన లేమి, మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చెరువు పరిసరాలు చెత్తమయంగా మారాయి. ఇప్పటికైనా జలాశయం వద్ద చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- మొయినాబాద్ రూరల్, ఆగస్టు30(ఆంధ్యజ్యోతి)

● కలువ పూల కనువిందు



కొత్తూర్ మండల పరిధి మల్లాపూర్-గూడూర్ రోడ్డులోని ఓ కొలనులో ఎర్ర కలువలు (తామర పువ్వులు) కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొలనులోకి భారీగా నీరు వచ్చి చేరింది. దీంతో కలువ పూలు విరగపూశాయి. అందంగా కనిపిస్తున్న ఈ పువ్వులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

- కొత్తూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి)

ఆక్రమణల గుర్తింపునకు

జాయింట్ సర్వే



చెరువులు, కుంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్, డీఈ

కడ్తాల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధి లోని చెరువులు, కుంటల భూముల నిర్ధారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇరిగేషన్, రెవెన్యూ అధి కారులు శనివారం జాయింట్ సర్వే నిర్వహించారు. ఎలిగుంట, పెద్ద కుంట, కుమ్మరి కుంట, దేవర చెరు వులను తహసీల్దార్ ముంతాజ్, ఇరి గేషన్ శాఖ డీఈ నరేందర్‌రెడ్డి, ఏఈ మహేందర్‌రెడ్డి పరిశీలించారు. సర్వేయర్ సాయికాంత్ ఆధ్వర్యంలో ఆరుగురు సర్వేయర్‌లు చెరువులు, కుంటల భూముల సర్వే ప్రారంభిం చారు. కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలో అనేక చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయని, మురు గు నీటిని చెరువు కుంటల్లోకి మళ్లిం చి నీటిని కలుషితం చేస్తున్నారని ఇటీవల ప్రభుత్వానికి, పలువురు ఉన్నతాధికారులకు స్థానికంగా ఫిర్యా దులు అందాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారు లు సంయుక్తంగా సర్వే చేపట్టడానికి రంగంలోకి దిగారు. సర్వే ద్వారా ఆయా చెరువు కుంటల హద్దులు, బఫర్ జోన్‌లు, ఆక్రమణలను తేలు స్తామని వారు తెలిపారు. చెరువు లు, కుంటల భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఫిర్యా దులు అందిన వాటిని సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.



ఆశ్చర్యం వేసింది..!

నా పేరు శేరి రాజు, గ్రామం ముడిమ్యాల, చేవెళ్ల మండలం, పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించిన ఓటరు జాబితాను చూశాను. జాబితా చూడగానే ఆశ్చర్యం వేసింది. నాకు మూడు సార్లు ఓటు హక్కు కల్పించారు. నా ఫొటో వేర్వేరుగా మూడు సార్లు జాబితాలో నమోదైంది. జాబితా తప్పుల తడకగా ఉంది. మా గ్రామంలో అన్ని వార్డుల్లో ఇదే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి ఓటరు జాబితాలో తప్పులను సరిచేయాలి.

చేవెళ్ల తహసీల్దారుకు వినతి పత్రం సమర్పిస్తున్న ముడిమ్యాల గ్రామస్తులు



తప్పుల తడక!

ముసాయిదా జాబితాలో బోగస్ ఓటర్లు



ఓటరు జాబితాలో ఒకరి పేరు మూడుసార్లు

మృతులు, శాశ్వత వలస వెళ్లినా లిస్టులో చోటు

ఒక్కో వ్యక్తికి మూడేసి ఓట్లు, ఒకే ఇంట్లో 20, 30..

జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితాపై 3,624 అభ్యంతరాలు

అత్యధికంగా శంషాబాద్, మహేశ్వరంలో మండలంలో...

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఓటర్ల ముసాయిదా జాబితా తప్పుల తడకగా ఉంది. మృతులు, స్థానికంగా నివసిం చని, శాశ్వతంగా వలస వెళ్లిపోయిన వారి పేర్లు జాబితాలో దర్శనమిస్తున్నాయి. ఎవరికీ తెలి యని వారు కూడా లిస్టులో ఉన్నారు. నిష్పక్షపా తంగా ఓటరు జాబితా తయారు చేస్తామని జిల్లా అధికారులు చెప్పినప్పటికీ వారి మాట లకు పనితీరుకు పొంతన లేకుండా ఉంది. ఒకే వ్యక్తి పేరు ఓటరు జాబితాలో ఒకటి కంటే ఎక్కువ సార్లు ఉంటే ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా తొలగిస్తున్నామని ఎన్నికల సంఘం చెప్పినప్ప టికీ.. జాబితా చూస్తే అవేవి జరిగినట్లు

మిగతా 8వ పేజీలో...

వచ్చిన అభ్యంతరాలివే..

అబ్దుల్లాపూర్‌మెట్	102
ఆమనగల్లు	225
చేవెళ్ల	110
ఫరూక్‌నగర్	260
ఇబ్రహీంపట్నం	85
చౌదరిగూడ	215
కడ్తాల్	163
కందుకూరు	202
కేశంపేట్	140
కొందుర్గు	229
కొత్తూరు	66
మాడ్గుల	124
మహేశ్వరం	265
మంచాల	115
మొయినాబాద్	256
నందిగామ	99
షాబాద్	78
శంషాబాద్	305
శంకర్‌పల్లి	139
తలకొండపల్లి	127
యాచారం	319

అభ్యంతరాలను ఆర్డీవోలకు పంపించాం



చనిపోయిన వారి పేర్లు, డబుల్ ఓట్లు, ఒక వార్డు నుంచి మరో వార్డుకు వచ్చిన ఓటర్లు, బోగస్ ఓట్లను తొలగించాలని జిల్లాలో మొత్తం 3,624 అభ్యంతరాలు వచ్చాయి. వీటిని సంబంధిత శాఖ అధికారులకు పంపించాం. ఓటరు జాబితా 'తప్పులతడకగా' అనే శీర్షిక ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. ముసాయిదా జాబితా అసెంబ్లీ ఓటరు జాబితా ప్రకారం తీసుకున్నట్లు చెప్పారు. తప్పులు ఉంటే మేమిమి చేయలేం. మాకు సంబంధం లేదు. ఆర్డీవోలు చూసుకోవాలన్నారు. ఎవరైనా చనిపోయిన వారి పేర్లు తొలగించాలంటే, డబుల్ ఓటర్లు ఉంటే.. తొలగించేందుకు ఆన్‌లైన్‌లో ఫాం-7 ద్వారా దరఖాస్తు చేయాలని, విచారణ చేసి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటారని ఆయన చెప్పారు.

– సురేష్ మోహన్, జిల్లా పంచాయతీ అధికారి

ఆమనగల్లులో అదనపు కోర్టు

ఏర్పాటుకు కృషి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి కరుణ కుమార్



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి కరుణ కుమార్

ఆమనగల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో అదనపు కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కరుణ కుమార్ అన్నారు. ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు భవనాల నిర్మాణం, అదనపు కోర్టు ఏర్పాటుకు హైకోర్టు ద్వారా ప్రభుత్వానికి సిఫారసు చేస్తా నని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవ రణలో శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ఆమనగల్లు జడ్జి కాటం స్వరూప, బార్‌అసోసి యేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్, సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మలతో కలిసి జిల్లా జడ్జి ప్రారంభించారు. అదేవిధంగా కోర్టు ఆవరణలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సహకారంతో రూ.60 వేలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటుతో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమనగల్లు కోర్టుకు అనువైన స్థలాలు, భవ నాల నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. షాద్‌నగర్ సబ్ కోర్టు పరి ధిలో ఉన్న ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కేసులను మహేశ్వరం మార్చాలని హైకోర్టుకు నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌ల ద్వారా బార్ అసోసియే షన్, న్యాయవాదులు చొరవ తీసుకోవాలని కోరారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జీవన్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 110 మంది వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీపీ కార్తీక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్, మాజీ అధ్య క్షులు లక్ష్మణశర్మ, మల్లేపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనే యులు, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, కోశాధికారి కొప్పు కృష్ణ, క్రీడా కార్యదర్శి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి వస్పుల మల్లేశ్, న్యాయవాదులు నరేందర్ రెడ్డి, జమీల్ అహ్మద్, లక్ష్మణ రాజు, మల్లేశ్, మధుగౌడ్, గణేశ్‌గౌడ్, మహేశ్, శివ కుమార్, శ్రీనివాస్, బీక్యనాయక్, సర్దార్ నాయక్, శ్రీశైలం, మురళీ కృష్ణ, సూపరింటెండెంట్‌లు మురళీధర్, వర్దన్ రాజు, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్ రెడ్డి, అధ్యక్షుడు గోవర్దన్ రెడ్డి, కార్యదర్శి గంప శ్రీనివాస్, సీఐలు జానకి రామ్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

వైద్య సేవల్లో ఆదర్శం

డాక్టర్ ఖోలేసాబ్

ఫ్యామిలీ డాక్టర్‌గా తాండూరులో సుపరిచితం



Sunday Special

ఉద్యోగ విరమణ పొందినా వైద్య వృత్తిలోనే..

ఎన్నో అవార్డులు, రివార్డులు కైవసం

1976లో సీఎం జలగం వెంగళరావు చేతుల మీదుగా అవార్డు

నాలుగు దశాబ్దాలుగా పేదలకు వైద్యసేవలు

ఫ్యామిలీ డాక్టర్ అంటే ఎవ రికీ తెలియని కాలమది. ఇంకా పాతకాలం విలు వలు మరిచిపోకుండా తన వైద్య వృత్తిని కొనసా గిస్తున్నారు డాక్టర్ నగేశ్‌చంద్ర ఖోలే. తాండూరు పరి సర ప్రాంతాల్లో ఆయనంటే అందరికీ సుపరిచితమే. వైద్యాధి కారిగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పరి పాలనాధ్యక్షుడిగా పేరుగడించారు. కలరా, అమ్మవారు, పోలియో, టీబీ వంటి కేసుల నివారణకు, కుటుంబ నియంత్రణ వ్యాసెక్టమీ శస్త్రచికిత్సల కోసం ఆయన చేసిన కృషి మరు వలేనిది. పదవీ విరమణ పొందినా, తొమ్మిది పదుల వయస్సులోనూ పేదలకు నామినల్ ఫీజుతో వైద్యం అందిస్తూ 'మన ఫ్యామిలీ డాక్టర్'గా ఆదర్శంగా నిలుస్తున్నారు.

తాండూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ నగేశ్‌చంద్ర ఖోలే ఆస్పత్రి సూపరింటెం డెంట్‌గా ఉన్న సమయంలో ఆస్పత్రి సమయం కంటే పది నిమిషాలు ముందుగానే ఉండేవారు. క్రమ శిక్షణకు ఆయన మొదటి ప్రాధాన్యం ఇచ్చేవారు. తాను నమ్మిన వైద్య వృతిని ఇంకా కొనసాగిస్తున్నారు. 1966లో గాంధీ ఆస్పత్రిలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఖోలే 1965లో హౌస్‌మెన్‌షిప్ తర్వాత 1968 నుంచి 1971వరకు పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రభుత్వ వైద్యులుగా నియమితు లయ్యారు. 1971-74లో తాండూరు టీబీ క్లినిక్ వైద్యుడిగా పని చేసి 1974-85లో సివిల్ అసి స్టెంట్ సర్జన్‌గా పదోన్నతి పొందారు. 1985-88లో బషీరాబాద్ సివిల్ అసిస్టెంట్ సర్జ న్‌గా, 1988-95లో పీపీ యూనిట్ వైద్యులుగా పని చేసి 1994లో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది 98 వరకు తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేశారు. తిరిగి 1998లో సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది 2001 వరకు తాండూరు ఆస్పత్రిలో పని చేశారు. 2000 సంవ త్సరంలో జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేట ర్‌గా మెడికల్ సూపరింటెండెంట్‌గా పని చేసి 2001లో పదవీ విరమణ పొందారు.



జలగం వెంగళరావు చేతులమీదుగా ఉత్తమ వైద్యుడిగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఖోలే(ఫైల్)

కుటుంబ నేపథ్యం

హైదరాబాద్‌లో బీద కుటుంబానికి చెందిన డాక్టర్ ఖోలే 7వ తరగతి చదువుతుండగా ఏజీ కార్యాలయంలో అకౌంట్స్ అధికారిగా పనిచే

మిగతా 7వ పేజీలో...

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు

రోబోటిక్స్‌పై శిక్షణ



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొం దించేందుకు రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్‌పై శని వారం శిక్షణనిచ్చారు. జిల్లాలో ఐదుచోట్ల ఇబ్ర హీంపట్నం బాలికల ఉన్నత పాఠశాల, జెడ్పీ హెచ్ఎస్ లింగంపల్లి, జెడ్పీహెచ్ఎస్ బద్వేల్, పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ అజీజ్‌నగర్, జీహెచ్ ఎస్ రాజేంద్రనగర్‌లలో 7,8,9 తరగతులకు చెందిన 682మంది బాలబాలికలకు ఈ శిక్షణ నిచ్చారు. కాగా ఇబ్రహీంపట్నంలో 134 మంది బాలికలు శిక్షణ పొందారు. సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కొనసాగింది. ఎలక్ట్రానిక్స్ ప్రాథమికాలు, సెన్సర్లు, మోటార్లు, రోబోటిక్స్ సూత్రాలు, హార్డ్ వేర్ వినియోగం, ప్రాజెక్టు నిర్మాణంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్ల తోపాటు పాఠశాలలకు రాబోయే రోబోటిక్స్ కార్యకలాపాల కోసం కిట్లను అందజేశారు. ముగింపు సమావేశంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు లావణ్య పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు నిధులివ్వండి

● పనులు ప్రారంభించి పూర్తి చేయండి

● సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల వినతి

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): షాద్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి రంగా రెడ్డి జిల్లాకు ప్రయోజనం కలిగించే లక్ష్మీదేవిపల్లి రిజ ర్వాయర్‌కు నిధులు కేటాయించి పనులు ప్రారంభించా లని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతూ ఎమ్మెల్యేలు వినతి పత్రాన్ని అందజేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బి. మనోహర్‌రెడ్డిలు ఆదివారం ముఖ్యమం త్రిని కలిశారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తే సాగు, తాగు నీటి సమస్య తీరుతుందని తెలిపారు. అలాగే షాద్‌న గర్ నుంచి పరిగి వరకు ఉన్న డబుల్ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించడానికి నిధులు ఇవ్వాలని కోరారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



సీఎంకు వినతి పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యేలు

బయటపడుతున్న ఫోర్జరీ అక్రమాలు

● దొంగ సంతకాలతో డబ్బు డ్రా ● బెంబేలెత్తుతున్న డ్వాక్రా మహిళలు

● యాచారం ఎస్‌బీఐలో డబ్బు విత్‌డ్రా ● బుక్ కీపర్ల హస్తముందుని ఆరోపణలు

7

రైతులకు తప్పని యూరియా తిప్పలు

యాచారం సొసైటీ ఎదుట బారులు



యాచారం సొసైటీ ఎదుట రైతుల పడిగాపులు

యాచారం, ఆగస్టు 30(ఆంధ్ర జ్యోతి): యాచారం మండల రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. శనివారం ఉదయం నుంచి సాయం త్రం వరకు వివిధ గ్రామాలకు చెందిన రైతులు యాచారం సొసైటీ ఎదుట బారులు తీరారు. సాయంత్రం వరకు కూడా యూరియా రాకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. కాగా, యూరియా లభించనప్పుడు నానో యూరియా వాడాలని మండల వ్యవసాయాధి కారి రవినాథ్ రైతులకు విజ్ఞప్తి చేశారు. నానో యూరియా కేవలం రూ.250కు లభిస్తుందని, దానిని రెండు ఎకరాలకు వాడుకోవచ్చని సూచిం చారు. నానో యూరియా వాడకం వల్ల నేల సార వంతం పెరుగుతుందన్నారు.







అంగన్‌వాడీ టీచర్ల పనిభారాన్ని తగ్గించాలి


నూతన కమిటీతో దేవేందర్

శంకర్‌పల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్ల పనిభారాన్ని తగ్గించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాలింగపురంలో శనివారం శంకర్‌పల్లి సెక్టార్ అంగన్వాడీల కమిటీని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ పాఠశాలల నిర్వహణ అంగన్వాడీలకే అప్పగించాలన్నారు. శంకర్‌పల్లి సెక్టార్ అధ్యక్షురాలిగా రాధ, కార్యదర్శి యాదమ్మ, కోశాధికారి మంగమ్మ, ఉపాధ్యక్షురాలిగా షఫీనాబేగంలను ఎన్నుకున్నారు.







ప్రజా జీవన ప్రమాణాల పెంపే ప్రభుత్వ ధ్యేయం


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పాల్గొన్న నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని చెప్పారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వివిధ మండలాల వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. వారితో నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. గ్రామాలు, తండాలను అభివృద్ధి చేసి ప్రజలకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వాస్పత్రులను ఆధునికీకరించి మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు వైద్య చికిత్సల ఖర్చులను ప్రభుత్వం భరిస్తోందని పేర్కొన్నారు. పేదలకు ఇల్లు కట్టిస్తున్నామని, రేషన్ కార్డులు ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధిని ఓర్వలేక విపక్షాలు ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి.కిషన్‌రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, సాయిలు, విజయ్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

మహేశ్వరంలో బీఆర్‌ఎస్‌కు తిరుగులేదు


నాగారం బీజేపీ నాయకులకు బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, గ్యారెంటీల పేరుతో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిందని, పాలన చేతగాని రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శనివారం నాగారానికి చెందిన 20 మంది బీజేపీ నాయకులు సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఉలికి పడితే ఊరుకునేది లేదని, మహేశ్వరంలో వారెన్ని ఎత్తులు వేసినా మహేశ్వరం గడ్డ బీఆర్‌ఎస్ అడ్డాగానే ఉంటుందన్నారు. ఇక్కడ కాంగ్రెస్‌కు మనుగడ లేదు.. బీఆర్‌ఎస్‌కు తిరుగులేదన్నారు. అధికారంలో ఎవరైనా ఉండొచ్చు గానీ మహేశ్వరం ఎమ్మెల్యేగా సబితారెడ్డి ఉందనే విషయాన్ని ప్రజలు మరచిపోవద్దన్నారు. ఏ ఆపదొచ్చినా పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉంటానన్నారు. తుక్కుగూడ కేంద్రంగా కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌ను అణచివేయాలని చూస్తున్నారని, అలాంటి వారు సబితారెడ్డిని ఏమీ చేయలేరన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం బీఆర్‌ఎస్ పాండుయాదవ్, లింగం, దయ్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





డిప్యూటీ రేంజర్ రవి సేవలు మరువలేనివి


డిప్యూటీ రేంజర్ రవి దంపతులను సన్మానిస్తున్న డీఎఫ్‌వో, రేంజర్లు

తాండూరు రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో డిప్యూటీ రేంజ్ అధికారిగా రసకపురం రవి 34ఏళ్లు అందించిన సేవలు మరువలేనివని జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. శనివారం రవి రిటైర్ అయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి డీఎఫ్‌వో ముఖ్య అతిథిగా హాజరై రవిని రేంజర్లు, బీట్ అధికారులతో కలిసి సన్మానించారు. రవి 1991లో వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్‌లో బీట్ అధికారి నియామకమై సేవలందించారని పేర్కొన్నారు. అటవీ అభివృద్ధి, ఫారెస్ట్ రక్షణ, మొక్కల పెంపకంపై దృష్టి సారించారన్నారు. అటవీ భూముల పరిరక్షణకు కృషిచేశారని తెలిపారు. అడాల్‌పూర్ సెక్షన్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టి ప్రస్తుతం రేంజ్ ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ చెందారని కొనియాడారు. కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారులు శ్రీదేవిసరస్వతి, రాజేందర్, శ్యాంసుందర్, సబిత, జూనియర్ ఫారెస్ట్ స్టాఫ్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు నాగేంద్రబాబు, సెక్షన్ అధికారులు స్వప్న, పీర్యానాయక్, బీట్ అధికారి మల్లయ్య, రిటైర్డ్ డిప్యూటీ రేంజర్ తాజుద్దీన్, రవి కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు మురళీధర్, వీరన్నల సేవలు ఆదర్శప్రాయం

వికారాబాద్: మురళీధర్, వీరన్న సేవలు పోలీస్ శాఖకు ఆదర్శప్రాయమైనవని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. దశాబ్దాల పాటు పోలీస్ శాఖకు సేవలందించిన అదనపు ఎస్పీ పి.వి.మురళీధర్, కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ బి.వీరన్నలు శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వారికి వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులంటే ప్రజలకు భరోసా కల్పించేలా వారు విధులు నిర్వర్తించారన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఎస్ఐ ర్యాంక్ నుంచి అదనపు ఎస్పీగా ఎదిగి 38 సంవత్సరాలు సేవలందించిన మురళీధర్ తన సహచరుల సహకారాన్ని గుర్తుచేసుకుంటూ.. ప్రజలకు సేవ చేయడం గౌరవం అని అన్నారు. కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరి ఎస్ఐగా 41ఏళ్లు సేవలందించిన వీరన్నను సత్కరించారు. వీడ్కోలు సభలో తాండూర్, వికారాబాద్ పరిగి డీఎస్పీలు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ఏవో జ్యోతిర్మయి, జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్, డీపీఓ సిబ్బంది, ఇతర అధికారులు, రిటైరైన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మురళీధర్, వీరన్నలకు శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు.


మురళీధర్, వీరన్నల దంపతులను శాలువాలు కప్పి సత్కరించిన వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

భూ సర్వే అవగాహనకు శిక్షణ పొందాలి

వికారాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): భూ సర్వే ప్రక్రియను సక్రమంగా చేపట్టేందుకు కచ్చితమైన అవగాహన కోసం శిక్షణ పొందాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం మద్గుల్ చిట్టంపల్లి డీపీఆర్సీలో ఆగస్టు 18 నుంచి రెండో విడత 50రోజుల పని దినాల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణనిచ్చే కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వచ్చి సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన భూ భారతి చట్టానికి అనుగుణంగా భూముల సర్వేకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే నివేదికను అందజేయాలని, అందుకు కచ్చితమైన శిక్షణను పొందాలని తెలిపారు. రెండో విడతలో జిల్లాలో 107మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న సర్వేయర్లు సర్వేలు నిర్వహించాల్సి ఉంటుదన్నారు. వివాదాల భూముల జోలికి వెళ్లొద్దని, అలాగే ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మంగీలాల్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామిరెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి



ఆందోళనకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అయ్యప్ప

యాచారం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని పేదలందరికీ ఇంటి స్థలాలిచ్చి ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి నర్సింహలు ప్రభుత్వాన్ని కోరారు. చింతపట్లలోని రెండెకరాల ప్రభుత్వ భూమిలో పేదలకు ఇంటి జాగలివ్వాలని శనివారం తహసీల్దార్ ఆఫీసు వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. పేదల ఇళ్లకు 2008లో ప్రభుత్వం పట్టాభూమి కొని ఎందుకు పంచడంలేదని ప్రశ్నించారు. ఇంటి జాగ లేక ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని వాపోయారు. స్థలాల కోసం ఓ వ్యక్తి మరణించినా అధికారులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. పేదలను గుర్తించి స్థలాలిచ్చేలా చర్యలుతీసుకుంటామని తహసీల్దార్ టి.అయ్యప్ప హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, జంగయ్య, బ్రహ్మయ్య, చందూ, శ్రీను, భాస్కర్, రమేష్, అంజయ్య పాల్గొన్నారు.

న్యాయవాదులకు నిరంతర అభ్యసన అవసరం


కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు జడ్జి నర్సింగ్‌రావు నందికొండ

శంకర్‌పల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు సమయపాలనతో పాటు నిరంతర అభ్యసన అవసరం అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి నర్సింగ్‌రావు నందికొండ అన్నారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ లా కాలేజీలో ఎన్‌జే.యశస్వి మెమోరియల్ పదో మూట్ కోర్టు పోటీలకు శుక్రవారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యాయవాదిగా తన ప్రస్థానం, వృత్తిలో సాధించిన ప్రగతిపై విద్యార్థులతో మాట్లాడారు. న్యాయవాద వృత్తిలో రాణించేందుకు ఏకాగ్రత, నిబద్ధత, నిరంతర అభ్యాసం తప్పనిసరి అని వివరించారు. మూట్ కోర్టు పోటీలతో న్యాయ విద్యార్థుల్లో చట్టాలపై నైపుణ్యాలు, వృత్తి మెలకువలు, వాదనాప్రతిభ, కోర్టుగది అనుభవం కలుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఇక్ఫాయ్ లాస్కూల్ డైరెక్టర్ రవిశేఖర్‌రాజు, డీన్ ప్రతాప్‌రెడ్డి, మూట్‌కోర్టు కో-ఆర్డినేటర్ హైమవతి తదితరులు పాల్గొన్నారు.

రైతులు సంఘటితం కావాలి


కేశవగూడలో రైతులతో మాట్లాడుతున్న గజేందర్‌గౌడ్

షాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):సమస్యల పరిష్కారానికి రైతులు సంఘటితం కావాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. బలరాముని జయంతిని పురస్కరించుకొని కేశవగూడలో శనివారం సంఘం ఆధ్వర్యంలో రైతు దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. నేడు రైతులు అనేక సమస్యలతో విలవిల్లాడుతున్నారన్నారు. విద్యుత్, రెవెన్యూ, మార్కెటింగ్ సమస్యలు వేధిస్తున్నాయని చెప్పారు. విద్యుత్ శాఖ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించక రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పంటల మార్కెటింగ్‌కు అవస్థలు పడుతున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా రైతులు ఏకం కావాలని సూచించారు. పొలం దున్ని పంటలు పండించి అందరి ఆకలి తీర్చిన బలరాముని జయంతి సందర్భంగా ఉత్సవాలను నిర్వహించామని తెలిపారు. నాయకులు సత్యనారాయణరెడ్డి, మల్లయ్య, రైతులు రాజు, చెన్నయ్య, నర్సింహులు, కృష్ణయ్య, శ్రీనివాస్, మల్లేష్, సతీష్, పాల్గొన్నారు.

మలయాళస్వామి ఆశ్రమ ఆస్తులను పరిరక్షించాలి


ఫిర్యాదు ప్రతులను చూపుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని శ్రీ మలయాళ స్వామి ఆశ్రమ ఆస్తులను పరిరక్షించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు ఆదివారం విలేకరులకు తెలిపారు. ప్రజల్లో దైవభక్తిని పెంపొందిస్తూ, అనాథలకు ఆశ్రయాన్ని ఇవ్వాలనే సంకల్పంతో షాద్‌నగర్‌కు చెందిన పలబట్ల వజ్రలింగం, ఆయన వారసులు మలయాళ స్వామి ఆశ్రమానికి స్థలం ఇచ్చి, ఆశ్రమ అభివృద్ధికి సహకారం అందించారని తెలిపారు. ఆశ్రమానికి ఫరూఖ్‌నగర్ మండలం చించోడ్‌లో సర్వే నంబర్లు 987, 988లలో 5.34 ఎకరాలు, అలాగే నందిగామలో సర్వే నంబరు 1603, 1607లలో 5ఎకరాలను దానం చేశారని తెలిపారు. ఫరూఖ్‌నగర్‌లో 540గజాల స్థలాన్ని సైతం దాతలు ఇచ్చారని చెప్పారు. ఈ ఆస్తులను ఆశ్రమ నిర్వాహకుడు దయానంద స్వామి అక్రమ రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నాడని ఆరోపించారు. ఆశ్రమాన్ని సైతం తన పేరిట మార్చుకునే యత్నం చేస్తున్నాడని పేర్కొన్నారు. ఈ ఆశ్రమ ఆస్తులపై సమగ్ర విచారణ చేసి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని నర్సింహులు కోరారు. ఫిర్యాదు ప్రతులను షాద్‌నగర్ ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్ సీఐకి అందజేసినట్టు ఆయన వివరించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


నరేందర్ రెడ్డిని సన్మానిస్తున్న డీసీపీ రాజేశ్

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని శంషాబాద్ డీసీపీ రాజేశ్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కాంసాన్‌పల్లిలో మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి సొంత డబ్బు రూ.3.5లక్షలతో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను శనివారం డీసీపీ ప్రారంభించారు. గ్రామంలో 32సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని.. నరేందర్‌రెడ్డిని సన్మానించారు. ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి


సమస్యను వివరిస్తున్న చంద్రారెడ్డి

కీసర రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని(హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్ఎండీసీఎల్) ఎస్ఈ శ్రీనివాస్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రాంపల్లి చౌరస్తా నుంచి యంనంపేట్ వరకు చేపట్టిన రోడ్డు పనుల జాప్యంపై మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, తదితరులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. సీఎస్ ఆదేశాలతో శనివారం ఎస్ఈ నాగారంలో రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్డు పనులు ఆలస్యంపై కాంట్రాక్టర్‌పై అసహనాన్ని వ్యక్తం చేశారు. ఆయనతో చంద్రారెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

ప్రీ ప్రైమరీ తరగతులకు ఇన్‌స్ట్రక్టర్లు

- చిన్నారుల బాగోగులు చూసేందుకు ఆయాలు
- నియామకాలకు నోటిఫికేషన్ జారీ
- జిల్లాలో 33 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు
- పాఠశాలలున్న గ్రామస్థులకు ప్రాధాన్యం
- సెప్టెంబరు 9 వరకు దరఖాస్తులకు అవకాశం

వికారాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఎంపిక చేసిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల బోధనకు ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించే 33 పాఠశాలల్లో వారిని నియమించనున్నారు. ఒక్కో పాఠశాలలో ఒక్కో ఇన్‌స్ట్రక్టర్, ఆయాలను నియమించనున్నారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు కనీస అర్హత ఇంటర్ లేదా సమాన విద్యార్హతను నిర్ణయించారు. ఇంటర్‌తో పాటు శిశు విద్య లేదా ప్రైమరీ విద్యా బోధనలో అనుభవమున్న వారికి ప్రాధాన్యం ఇస్తారు. ఆయా పోస్టులకు కనీస అర్హత ఏడవ తరగతి ఉత్తీర్ణత ఉండాలని నిర్ణయించారు. 18 నుంచి 44సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉన్న వారే అర్హులు. ఇన్‌స్ట్రక్టర్లు, ఆయా పోస్టుల దరఖాస్తు చేసే అభ్యర్థులు తప్పనిసరిగా అదే గ్రామానికి చెందిన వారై ఉండాలి.. ప్రీ ప్రైమరీ పాఠశాల ఉన్న గ్రామ వాసిగా ధ్రువీకరించుకునేందుకు నివాస పత్రం జతపర్చాలి. ఎంపికైన ఇన్‌స్ట్రక్టర్లకు ప్రీప్రైమరీ తరగతుల బోధనపై శిక్షణ ఇవ్వనున్నారు. ఇదిలా ఉంటే, ఎంపికైన ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలకు ఒక విద్యా సంవత్సరంలో పది నెలల గౌరవ వేతనం చెల్లిస్తారు. ప్రీ ప్రైమరీ తరగతుల బోధన ఇన్‌స్ట్రక్టర్లు, చిన్నారుల ఆలన ఆయాలు చూసుకోవాలి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతలు, నివాస ధ్రువపత్రాలతో సెప్టెంబరు ఒకటి నుంచి తొమ్మిదో తేదీ వరకు కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రేణుకాదేవి తెలిపారు.

ప్రీప్రైమరీ పాఠశాలలు ఇవే

జిల్లాలో 33 ప్రీప్రైమరీ పాఠశాలలను ఎంపిక చేయగా, అక్కడ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల పోస్టుల భర్తీకి అధికారులు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. షాపూర్, అల్లాపూర్, ఐనాపూర్, ఓగీపూర్, పొల్కంపల్లి, సంగెంకుర్దు, పిల్లిగుండ్ల, బస్వాపూర్, రాంరెడ్డిపల్లి, చక్రంపల్లి, గౌరారం, నవాంద్గి, ఐలాబాద్ తండా, కట్టే పహాడ్ తండా, రంగాపూర్, దామర్‌చెడ్, చెన్నారం, చెంగేష్‌పూర్, కస్మన్‌కాల్వ, లచ్చియానాయక్ తండా, సయ్యద్ మల్కాపూర్,అన్నసాగర్, ఖుదావందాపూర్, దోర్నాల్, రావులపల్లి, సాలిండాపూర్, మల్లికార్జునగిరి, మల్లెమోనిగూడ, ఎన్కేపల్లి, టక్రియానాయక్ తండా, నజఖాన్‌పల్లి, ఏకేతండా, కేశవపల్లి.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



ఎంపిక చేసిన ప్రైమరీ స్కూళ్లలో ప్రీ ప్రైమరీ తరగతుల బోధనకు ఇన్‌స్ట్రక్టర్, పిల్లల బాగోగులు చూసుకునేందుకు ఆయా పోస్టులకు అర్హులు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. పాఠశాల ఉన్న గ్రామాల వారికి ప్రాధాన్యం. అభ్యర్థులు లేకుంటే హ్యాబిటేషన్/పక్క గ్రామాల వారికి అవకాశం. జిల్లా కమిటీ ఎంపిక చేస్తుంది.

- జి.రేణుకాదేవి, డీఈవో, వికారాబాద్

బయటపడుతున్న ఫోర్జరీ అక్రమాలు

- దొంగ సంతకాలతో డబ్బు డ్రా
- బెంబేలెత్తుతున్న డ్వాక్రా మహిళలు
- యాచారం ఎస్‌బీఐలో డబ్బు విత్‌డ్రా
- బుక్ కీపర్ల హస్తముందుని ఆరోపణలు
- విచారణ చేస్తున్న అధికారులు



యాచారం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదర్‌పల్లి, మల్కీజ్‌గూడ గ్రామాల్లో డ్వాక్రాసంఘాల్లో ఫోర్జరీ సంతకాలతో డబ్బు డ్రా చేయడంతో యాచారం ఎస్‌బీఐ అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్వాక్రా మహిళలకు రుణాలివ్వాలిచ్చే సూక్ష్మ జీవనోపాధుల ప్రణాళిక యాప్‌లో సంఘాల సభ్యుల వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఆ తరువాత ఆయా సీసీలకు సమాచారమందుతుంది. సీసీలు ప్రతిపాదనలు ఏపీఎంకు పంపిన తరువాత మహిళలను రుణం ఎందుకోసం తీసుకుంటున్నారు? అనే దానిపై సీసీ, ఏపీఎంలు విచారణ చేసి సహేతుక కారణం ఉంటే సంఘం సభ్యులకు రుణం ఇవ్వాలని బ్యాంక్ అధికారులకు సూచిస్తే బ్యాంకు రుణం మంజూరవుతుంది. అయితే ఇవేమీ లేకుండానే చౌదర్‌పల్లి, మల్కీజ్‌గూడ డ్వాక్రా సంఘాల సభ్యుల దొంగ సంతకాలతో నిధులు డ్రాచేశారు. నెలల వ్యవధిలో రెండు గ్రామాల డ్వాక్రా సంఘాల పేరిట నిధులు డ్రాచేయడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. తాము అప్పు తీసుకోకున్నా తీసుకున్నట్టు రికార్డుల్లో చూపుతున్నారని చెబుతున్నారు. చౌదర్‌పల్లిలో డీఫాల్ట్ అయిన సంఘ పేరిట సైతం రూ.20లక్షలు డ్రా చేయడంతో డీఆర్‌డీఏ అధికారులు విస్తుపోయారు. ఈ గ్రామంలో డ్వాక్రా మెంబర్ సొలేటి పద్మ ఖాతాలో రూ.30వేలు డ్రాచేశారని బ్యాంకు అధికారులకు తెలిపారు. చౌదర్‌పల్లిలో ఎస్‌హెచ్‌జీల్లో జరిగిన అక్రమాలపై అధికారులు విచారణ చేస్తున్నకొద్దీ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. మహిళల దొంగ సంతకాలతో డబ్బు డ్రా చేసిన అక్రమాలు బయటపడుతున్నాయి. దీంతో బ్యాంకు, డీఆర్‌డీఏ అధికారులు విస్తుపోతున్నారు. 2023 నుంచి ఫోర్జరీ సంతకాలతో డబ్బు డ్రా చేసినట్టు విచారణలో తేలుతోంది. మండలంలోని 24 పంచాయతీల్లో 43గ్రామ సమాఖ్యలు, 1,224 స్వయం సహాయక సంఘాలున్నాయి. అయితే కార్యకలాపాలన్నీ బుక్ కీపర్లే చూస్తూ మహిళలను నమ్మించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బుక్ కీపర్ల మాయతోనే ఫోర్జరీ సంతకాలతో డబ్బు డ్రా చేశారని బ్యాంక్ అధికారులు సైతం అనుమానిస్తున్నారు.

బ్యాంక్ మేనేజర్ పాత్రపై విచారణ

రెండు గ్రామాల్లో ఫోర్జరీ సంతకాలతో డబ్బు డ్రా చేసిన వైనంపై ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సంజయ్ కుమార్ ఇటీవల యాచారం బ్రాంచ్‌లో విచారణ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డబ్బు డ్రా చేసేందుకు ఎవరు సహకరించారనేదానిపై పరిశీలించారు. అక్రమాల్లో బ్యాంక్ అధికారుల పాత్రపై విచారణ చేస్తున్నట్లు ఆర్ఎం వెల్లడించారు. ఈ అక్రమాల నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల సీసీలను ఇతర మండలాలకు బదిలీకి డీఆర్‌డీఏ అధికారులు రంగం సిద్ధం చేశారు. అక్రమాల్లో బుక్‌కీపర్ల పాత్ర ఉందని మహిళలంటున్నారు. ఈ నేపథ్యంలో వారిని పక్కన పెట్టేందుకు నిర్ణయించినట్టు తెలుస్తోంది.

బాధ్యులందరిపై క్రిమినల్ కేసులు



ఈ కుంభకోణాలకు బాధ్యులైన బుక్ కీపర్లపై, బ్యాంక్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. సీసీల బదిలీ కోసం కౌన్సిలింగ్ తీసుకుంటున్నాం. జిల్లాలో ఇక నుంచి మరెక్కడ ఇలాంటి మోసాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. డ్వాక్రా మహిళలు కూడా తరచూ వారి అకౌంట్లు, లావాదేవీలపై బ్యాంకులో తనిఖీ చేయించుకోవాలి.

- శ్రీలత, డీఆర్‌డీవో పీడీ

సౌకర్యాలు పొందుతూ అసెంబ్లీకి రాని కేసీఆర్

- పీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్


మిద్దెల జితేందర్‌ను సన్మానిస్తున్న మండ్లీ రాములు, కానుగు దశరథ్ తదితరులు

ఆమనగల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ప్రభుత్వం ద్వారా వేతనం, ఇతర సౌకర్యాలు పొందుతూ ఫామ్‌హౌజ్‌కే పరిమితమయ్యారని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. అసెంబ్లీకొచ్చి రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన కేసీఆర్ తన బాధ్యతలను విస్మరించారని ఆరోపించారు. ఆమనగల్లులో శనివారం జితేందర్ పర్యటించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు కార్యాలయంలో ఆయన స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. కానుగుల దశరథం, రాములు, ఆమనగల్లు ఏఎంసీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు జితేందర్‌ను సత్కరించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోపిడీ చేసిందన్నారు. కేసీఆర్ కుటుంబ దుర్మార్గాలు, అవినీతి వెలుగు చూస్తుండడంతో కేసీఆర్ ముఖం చాటేసి ఫామ్‌హౌజ్‌కే పరిమితమయ్యారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వేల కోట్ల అవినీతి జరిగిందని పీసీ ఘోష్ కమిషన్ నివేదికిచ్చిందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులకు దమ్ముంటే అంసెబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తుంటే బీఆర్ఎస్ నేతలు అడ్డుకునే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ సోపానాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున ప్రజలు ఈ పార్టీ అభ్యర్థులనే గెలిపిస్తే ఆశించిన విధంగా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎన్నికలేవైనా కాంగ్రెస్‌దే విజయమన్నారు. సమావేశంలో సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి సురేందర్, జిల్లాధ్యక్షులు మిద్దెల మల్లేశ్, సురేశ్‌బాబు, రాష్ట్ర నాయకుడు ఎం.దాస్, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా/మండల నాయకులు వస్పుల మానయ్య, శ్రీనునాయక్, అంజ్యనాయక్, రాఘవేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి


ప్రొఫెసర్ సురేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకొని ఉన్నత స్థానాలకు చేరాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సురేష్‌కుమార్ లోఖండే అన్నారు. ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 'ప్రారంభ్ 2025' పేరిట ఒరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. బీటెక్ ఫస్టియర్ నుంచే లక్ష్యాలను ఎంచుకొని చదవాలన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డిలు అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో కాలేజీ స్ట్రాటజీ డైరెక్టర్ కె.దివ్యశ్రీ, డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూరియాపై కాంగ్రెస్‌ను నిందించడం సిగ్గుచేటు


విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సరిపడా యూరియాను సరఫరా చేయని కేంద్ర ప్రభుత్వాన్ని నిందించకుండా మాజీ ఎమ్మెల్యే ఆనంద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించటం సిగ్గుచేటని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయబాస్కర్‌రెడ్డి, ఇతర నాయకులతో శనివారం ధారూరులో మాట్లాడారు. యూరియా కొరతకు కారణమైన బీజేపీ పాలకులను వదిలేసి కాంగ్రెస్‌పై ఆనంద్ నిందలేయడం సరికాదని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కై కాంగ్రెస్‌ను బద్నాం చేసేందుకు నాటకాలు ఆడుతున్నారన్నారు. బీఆర్ఎస్‌కు రైతులపై ప్రేముంటే కేంద్రంతో పోరాడాలని హితవు పలికారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ అభివృద్ధి పనులు చేస్తుంటే ఓర్వలేక ఆనంద్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. దోర్నాల వంతెన దాటుతూ రైతులు చనిపోతే వంతెన నిర్మాణంపై స్పందించని ఆనంద్ రైతుల గురించి మాట్లాడటం శోచనీయమన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ పి.రాములు, నాయకులు బుజ్జయ్యగౌడ్, గప్పార్, రవి, సత్యనారాయణగౌడ్, లాల్, ఇబ్రాహీం పాల్గొన్నారు.

పెన్షన్ల పెంపులో సీఎం విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న బాబు

కందుకూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకిచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచడంలో విఫలం అయ్యారని ఎంఎస్‌పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు అన్నారు. శనివారం కందుకూరులో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లెపల్లి క్రిష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన ఒక్క హామీనీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. వృద్ధులు, వితంతువులకు పెన్షన్‌ను 4వేలకు పెంచుతామని, దివ్యాంగులకు 6వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ఎండగట్టేందుకే సెప్టెంబరు 8న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ కందుకూరు పట్టణానికి రానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు బక్కని రవి, మస్కు బాబు, మంద సాయిలు, పొట్ట కుమార్, మంద నరసింహ, జి.జంగయ్య, వై.జంగయ్య, ఎర్ర గణేష్, కత్తుల వెంకటేశ్, డాక్టర్ జంగయ్య, అర్జున్, బిక్షపతి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు భూమి కేటాయించొద్దు


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కొత్తూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కొడిచర్లతండా పంచాయతీలోని సర్వే నంబర్ 198లోని ప్రభుత్వ భూమిని క్రిస్టియన్ శ్మశానవాటికకు కేటాయించవద్దని కొడిచర్ల మాజీ ఎంపీటీసీ బి.రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, ఆర్డీవో ఎస్ఆర్ సరిత, కొత్తూర్ తహసీల్దార్ రవీందర్‌రెడ్డిలకు శనివారం వినతిపత్రాలందజేశారు. శ్మశాన వాటిక ఏర్పాటుకు చేస్తున్న సర్వేను ఉపసంహరించుకోవాలని కోరారు. కొడిచర్ల తండా పంచాయతీకి భవనం లేదని, అక్కడ పంచాయతీ భవనాన్ని కట్టాలిగానీ, శ్మశనవాటికకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. శ్మశనవాటిక ఏర్పాటు కాకుండా, పంచాయతీ భవనానికి భూమి కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం

కందుకూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సర్కారు పాఠశాలలను మరింత బలోపేతం చేసేలా కార్యాచరణ రూపొందిస్తోందని, అందులో భాగంగానే మండలంలోని ఐదు పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభిస్తామని ఎంఈవో హెచ్.నరసింహ శనివారం తెలిపారు. మాదాపురం, జైత్వారం, ప్రాథమికోన్నత పాఠశాలలు, మాన్యగూడ, ఉట్లపల్లి, లేమూరు ఉన్నత పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభిస్తామని తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలను నియమిస్తామని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆదివారం నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు మండల విద్యాధికారి కార్యలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

మొయినాబాద్: కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభిస్తామని ఎంఈవో మల్లయ్య తెలిపారు. శ్రీరాంనగర్, నాగిరెడ్డిగూడ, కేతిరెడ్డిపల్లి, తోల్కట్ట, పెద్దమంగళారం, వీరన్నపేట్ పాఠశాలల్లో వీటిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నాలుగేళ్ల పైబడిన పిల్లలు ఈ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో అడ్మిషన్ పొందుతారని తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు అర్హతున్న గ్రామస్తులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వైద్య సేవల్లో ఆదర్శం.. డాక్టర్ ఖోలేసాబ్

(ఐదో పేజీ తరువాయి)


1974లో వేసక్టమీ ఆపరేషన్లకు పురుషులను క్యూలో కూర్చోబెట్టిన డాక్టర్ ఖోలే

ఆయన తండ్రి మృతి చెందాడు. తల్లికి వస్తున్న పెన్షన్‌తో పుస్తకాలు కొనుగోలు చేసి కష్టించి వైద్య విద్యను పూర్తి చేశారు. ముగ్గురు సోదరులు, ఒక సోదరి ఉండగా, వృత్తి పరంగా అందరూ ఉద్యోగులే. తాండూరులో ఎక్కువ కాలం వైద్య సేవలు చేసినందుకు ఆయన హైదరాబాద్‌ను మరిచిపోయి తాండూరుతో విడరాని బంధం ఏర్పడి ఇక్కడే స్థిరపడిపోయారు. తన కుటుంబం హైదరాబాద్‌కు వచ్చి విశ్రాంతి తీసుకోవాలని కోరినా అందుకు ఆయన తిరస్కరించారు.

సర్జరీలు.. అవార్డులు

అప్పట్లో తాండూరులో ఒకరిద్దరు మాత్రమే సర్జన్లు ఉండేవారు. అందులో డాక్టర్ ఖోలే ఒకరు. ప్రభుత్వ ఆస్పత్రిలో లక్ష్యాలకు మించి కు.ని, అరకొర సిబ్బందితోనే మేజర్ ఆపరేషన్లు చేసి బెస్ట్ డాక్టర్‌గా పేరు గడించారు. 1976లో ముఖ్యమంత్రి జలగం వెంగళరావు చేతుల మీదుగా హ్యాపీ హోం పేరిట అవార్డు, డైరెక్టరేట్ యూత్ సర్వీసెస్ అవార్డు అందుకున్నారు. ఔట్ పేషెంట్ పోస్టుమార్టం, ఎంఎల్‌సీ, ప్రసూతీ వైద్యం, సర్జరీ కేసులు ఖోలే ఒక్కరే చూసుకునే వారు.

200 పడకల ఆస్పత్రి కోసం విశేష కృషి

తాండూరులో 30పడకల సివిల్ ఆస్పత్రి ఉన్న సమయంలో అప్పటి ఎమ్మెల్యే మాణిక్‌రావు ద్వారా ఆస్పత్రికి అంబులెన్స్ ఫోన్ సౌకర్యం వంటివి కల్పించుకోగలిగారు. తర్వాత ఎమ్మెల్యే మహేందర్‌రెడ్డి ద్వారా 200పడకల ఆస్పత్రిని సాధించుకునేందుకు డాక్టర్ ఖోలే ప్రయత్నాలు చేశారు. ఆస్పత్రి ప్రారంభం సమయానికి ఖోలే ఉద్యోగ విరమణ పొందారు. ఇప్పటికీ తనకు 90ఏళ్ల వయస్సున్నా తుదిశ్వాస వరకు వైద్య సేవలందిస్తానని డాక్టర్ ఖోలే చెబుతున్నారు. ప్రజలు ఖోలే దగ్గరికి వెళ్లి వైద్య సేవలు పొందుతుండడం విశేషం.

తల్లిని చంపాడని వ్యక్తిపై కత్తితో దాడి

దౌల్తాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తల్లిని చంపిన వ్యక్తిపై కొడుకు కత్తితో దాడి చేసిన ఘటన దౌల్తాబాద్ మండలంలో జరిగింది. ఈర్లపల్లికి చెందిన లోడుగు భీములు పదేళ్ల కింద తన తల్లిని అదే గ్రామానికి చెందిన బాబు చంపాడని కక్ష పెంచుకున్నాడు. అతడిని హతమార్చాలని పథకం ప్రకారం కొద్ది రోజులుగా బాబుతో సన్నిహితంగా ఉంటున్నాడు. శనివారం బాబుకు మద్యం తాగించి కత్తితో పొడిచాడు. స్థానికుల సమాచారంతో చేరుకున్న ఎస్సై రాజ్‌కుమార్ బాబునుమొదట కోస్గి, అనంతరం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని శనివారం రాత్రి కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు.

బొబ్బిలిగామ వద్ద బ్రిడ్జిని నిర్మించండి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

షాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వాగు పారడంతో మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈమేరకు వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ శనివారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎంపీ స్పందించి బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే రత్నం, షాబాద్ మండల ఎలక్షన్ ఇన్‌చార్జి ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు మాణయ్య, ప్రధాన కార్యదర్శి హరీష్, శక్తికేంద్రం ఇన్‌చార్జి రమేష్, భవదీష్, అనిల్‌రెడ్డి, సుధాకర్, శేఖర్, తరుణ్, బాల్‌రాజ్ తదితరులు ఎంపీని కలిశారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి



కార్యక్రమంలో ఎస్సైలు సంతోష్‌రెడ్డి, తేజశ్రీ తదితరులు

చేవెళ్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటూ బంగారు భవిష్యత్‌కు శ్రీకారం చుట్టాలని ఎస్సైలు సంతోష్‌రెడ్డి, తేజశ్రీలు తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శ్రీ చైతన్య జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఎస్సైలు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతులుగా ఎదిగి గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ అయ్యావారి గోపాలచారి చెక్కులను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, డైరెక్టర్లు శ్రీకాంత్‌ముదిరాజ్, మనోహర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పుల తడక!

(ఐదో పేజీ తరువాయి)

కనిపించడం లేదు. ఓపెన్ ప్లాట్, సర్వేనెంబర్‌లతో ఓటు హక్కు కల్పించడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఓటరు జాబితాపై జిల్లా ప్రజలు మండిపడుతున్నారు. బోగస్ ఓటర్లను తొలగించి పారదర్శకంగా తుది జాబితాను రూపొందించాలని కోరుతున్నారు.

ముసాయిదాపై అభ్యంతరాల వెల్లువ

ఈనెల 28న ముసాయిదా జాబితా ప్రకటించారు. 29న జిల్లా స్థాయిలో ఓటరు జాబితాపై వివిధ రాజకీయ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. 30వ తేది వరకు సంబంధిత కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధికి అభ్యంతరాలు తెలిపే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు వెల్లువెత్తాయి. జిల్లాలో మొత్తం 3,624 అభ్యంతరాలు స్వీకరించారు. అత్యధికంగా శంషాబాద్, మహేశ్వరం, ఆమనగల్లు, కందుకూరు, మొయినాబాద్, యాచారం నుంచి పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు వచ్చాయి. పంచాయతీల వారీగా స్వీకరించిన అభ్యంతరాలను ఎంపీడీవోలకు అందించారు. అభ్యంతరాల్లో చనిపోయిన ఓటరు పేర్లు జాబితాలో రావడం, ఒకే కుటుంబానికి చెందిన పేర్లు ఒకే వార్డులో కాకుండా ఇతర వార్డుల్లో వచ్చినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. వివాహం అయ్యాక అత్తారింటికి వెళ్లిన మహిళల పేర్లు తొలగించాలని, వలస వెళ్లిన వారి పేర్లు రెండుచోట్ల నమోదైనట్లు గుర్తించి వాటిని తొలగించాలని అభ్యంతరాలు వెలువడ్డాయి. మాడ్గుల మండలం నల్లచెరువు గ్రామంలో ఓటరు జాబితాల్లో తప్పులు దొర్లినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొందుర్గు గ్రామ పంచాయతీతో ఓటరు జాబితా ప్రదర్శించలేదని గ్రామస్తులు తెలిపారు. ఓటరు జాబితాలో ఒక వార్డులో ఉండాల్సిన కుటుంబ సభ్యుల పేర్లు ఇతర వార్డులో రావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించనున్నారు. వచ్చేనెలా 2న తుది జాబితాను ప్రకటించనున్నారు.

బోగస్ ఓట్లను తొలగించాలని వినతి

బోగస్ ఓట్లు తొలగించాలని చేవెళ్ల మండలం మూడిమ్యాల గ్రామస్తులు కోరారు. శనివారం బీఆర్ఎస్ సీనియర్ నేతలు గోనె కరుణాకర్ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీవో, చేవెళ్ల తహసీల్దార్, ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రిలీజ్ చేసిన ముసాయిదా ఓటరు జాబితా తప్పుల తడకగా ఉందని ఆరోపించారు. గ్రామానికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులను ఓటరు జాబితాలో చేర్చారని, సర్వే నెంబర్లు, ప్లాట్ల నెంబర్లతో ఓటు హక్కు కల్పించారని విమర్శించారు. ఒక్కో ఇంటి నెంబర్‌పై 15 ఓట్ల వరకు ఉన్నాయని, కొన్ని ఇళ్లలో హిందూ, ముస్లిం ఓట్లు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విచారణ జరిపి బోగస్ ఓట్లు తొలగించాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహసీల్దార్ ఈ అభ్యంతరాలపై ఫామ్ 7 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముడిమ్యాలలో బోగస్ ఓటర్లు వీరే..

వార్డు నెంబర్ వన్‌లో షఫీ మహమ్మద్, షహీన్‌బేగం, ఉలల్లిదానయ్య, ఉల్లి భాగ్యలక్ష్మి, ఫర్వీన్‌బేగం, షహానా బేగం, వార్డు నెంబర్ 2లో వేపురి లక్ష్మమ్మ, కొన్నోటి రోజ, జక్క కార్తిక్, వేపూరు అంజిలయ్య, అమరావతి గుత్తంగూడు, శివకుమార్ మెగులంపల్లి, రాఘవేందర్, గణేష్‌కుమార్ వొంగూరి, పవన్‌జి, ప్రత్యూష సంగోముల, కునుకుర్తి నవీన్, రాఘవేందర్‌రెడ్డి, రామస్వామి, బి.సాయికుమార్, శంకర్ కుమార్ సాహు, కావలి నవీన్‌కుమార్, గుడిపల్లి శ్రావణి, వార్డు నెంబర్ 3లో అనూష, పడాల పెంటమ్మ, లక్ష్మీబాగరి, చిరంజీవి, బ్యాగరి, జ్యోతి బ్యాగరి, సురేష్ బ్యాగరి, వార్డు నెంబర్ 5లో కృష్ణరమ్య మంగలి, ప్రత్యూష బండి, సలీం, మహారాజ్‌బేగం, బురున్నీసా, ఎండీ మనస్వర్, అజ్గరీ బేగం, షేక్ మహమ్మద్, నీలంసింగారి, మేడిశెట్టి తరుణ్‌కుమార్, మాదారం లక్ష్మీ, షబానా బేగం, రమేష్, మున్నీ, షబానా బేగం, వార్డు నెంబర్ 6లో మహ్మద్ ఉస్మాన్‌ఘని, మహ్మద్ అస్లాం, ఆసినాబేగం, యాస్మిన్‌బేగం, వార్డు నెంబర్ 7లో 28 మంది, వార్డు నెంబర్ 8లో ఆరు మందివి బోగస్ ఓట్లు ఉన్నట్లు ఆర్డీవో, తహసీల్దారు, ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి



ఇబ్రహీంపట్నం : ఓటరు జాబితాపై అఖిలపక్ష నాయకులతో సమావేశమైన ఎంపీడీవో వెంకటమ్మ

ఆమనగల్లు/మాడ్గుల/శంకర్‌పల్లి/షాబాద్/ఇబ్రహీంపట్నం/చేవెళ్ల/చౌదరిగూడ/మంచాల/యాచారం/మొయినాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే ఆదివారం వరకు పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలని ఎంపీడీవోలు రెహమాన్, సుజాతలు కోరారు. పోలింగ్ కేంద్రాలపై కూడా ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని సూచించారు. ఆమనగల్లు, కడ్తాల్ మండల పరిషత్ కార్యాలయాలలో శనివారం ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామాల వారిగా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు వివరించారు. తహసీల్దార్ ముంతాజ్, నాయకులున్నారు. మాడ్గుల గ్రామపంచాయితీ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై ఓటరు జాబితా ముసాయిదాను ప్రదర్శించారు. కొన్ని గ్రామాల్లో తప్పులు దొర్లాయని కార్యదర్శి స్వప్న తెలిపారు. శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితా, పోలింగ్‌పై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. తప్పులు లేని జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని షాబాద్ ఎంపీడీవో అపర్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈవోపీఆర్డీ శారద, నాయకులున్నారు. ఓటరు జాబితాపై అభ్యంతరాల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఇబ్రహీంపట్నం ఎంపీడీవో వెంకటమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో అఖిల పక్ష పార్టీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అభ్యంతరాలు లేవనెత్తారు. కాగా, శనివారం వరకు వచ్చిన అభ్యంతరాలను ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఎంపీడీవోకు అందజేశారు. ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ నాయకులు సహకరించాలని చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో అభ్యంతరాలపై సమావేశం నిర్వహించారు. తప్పులు సరి చేయాలని 106 ఫిర్యాదులు వచ్చాయన్నారు. నాన్‌చెరు గ్రామ పంచాయతీలోని పోలింగ్ స్టేషన్‌ను ఇంద్రారెడ్డి నగర్‌కు మార్చాలని కొందరు, నాన్‌చెరులోనే ఉంచాలని మరికొందరు గ్రామానికి చెందిన నాయకులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఓటర్ జాబితాలో ఉన్న తప్పులను సరిచేసుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు. నాయకులతో ఓటర్ జాబితాపై సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా రూపకల్పన పారదర్శకంగా నిర్వహిస్తామని మంచాల ఎంపీడీవో బాలశంకర్ తెలిపారు. గ్రామపంచాయతీల్లో ప్రదర్శించిన ఓటరు ముసాయిదా జాబితాకు సంబంధించి మండల పరిషత్తు కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. యాచారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ లిస్టు డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. నాయకులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. తప్పొప్పులపై బీఎల్‌వోలకు వివరించినా ఎందుకు పట్టించుకోలేదన్నారు. తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రాధారాణి చెప్పారు. అదవిధంగా మొయినాబాద్ మండల పరిషత్ కార్యాయంలో ఓటరు జాబితా ముసాయిదాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. బాకారంలోనే 87 మంది గుర్తుతెలియని వ్యక్తుల ఓట్లు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఎంపీడీవో సంధ్య, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్‌కింద పడి వ్యక్తి మృతి

● గుండెపోటు రావడంతో దుర్ఘటన

షాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన అమెజాన్ కంపెనీలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. రుద్రారం గ్రామానికి చెందిన అల్లాడ శేఖర్(34) ప్రైవేటుగా వాటర్ ట్యాంకర్ నడిపిస్తూ ఉండేవాడు. శుక్రవారం రాత్రి అమెజాన్ కంపెనీలో వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు తీసుకెళ్లి పోసి వస్తుండగా.. గుండెపోటు రావడంతో ట్రాక్టర్ టైర్‌కింద పడ్డాడు. దాంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన ఫుటేజీ కంపెనీలోని సీసీ టీవీలో నమోదైంది. కాగా, శేఖర్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కంపెనీ ఎదుట ధర్నా చేయడంతో యాజమాన్యం పరిహారం చెల్లించింది. మృతుడు శేఖర్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

కేశంపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధి వేముల్‌నర్వలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. వేముల్‌నర్వ గ్రామానికి చెందిన కమ్మరి చంద్రయ్య(45) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పదేళ్లుగా భార్య, పిల్లలను కేశంపేటలో విడిగా ఉంటున్నారు. ఈక్రమంలో అతడు మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో చింతకుంటపల్లి శివారులోని వట్టే కుమార్ వ్యవసాయ పొలంలో తీవ్రగాయాలతో చనిపోయాడు. అతడి తమ్ముడు శ్రీను.. చంద్రయ్య కిందపడటంతో తీవ్రగాయాలై మృతిచెందాడని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదం.. యువకులకు తీవ్ర గాయాలు

కడ్తాల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శనివారం రాత్రి సంఘటన జరిగింది. పోలీసులు కథనం మేరకు కందుకూరు మండలం దెబ్బడగూడకు చెందిన ప్రసాద్, రాజేశ్‌లు కడ్తాల్ బటర్‌ఫ్లై సిటీలో పెయింటింగ్ పని నిమిత్తం ఉదయం బైక్‌పై వెళ్లారు. పనులు ముగించుకొని సాయంత్రం దెబ్బడగూడ వెళ్తుండగా హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై కడ్తాల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో శ్రీశైలం వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దాంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు సంఘటన స్థలాన్ని సీఐ గంగాధర్, ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

కదులుతున్న బస్సులోంచి కిందపడ్డ వ్యక్తికి..

శంకర్‌పల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వ్యక్తికి ఫిట్స్ వచ్చి కదులుతున్న బస్సులోంచి కిందపడటంతో ముఖానికి గాయాలయ్యాయి. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని సింగాపురం గ్రామానికి చెందిన నర్సింలు నాలుగు నెలల నుంచి క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ బస్సు కేర్ టేకర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం స్కూల్ బస్సులో పిల్లలను ఎక్కించుకొని దింపి రావడానికి బయలుదేరింది. బస్సు డోర్ వద్ద నిలబడ్డ నర్సింలుకు ఫిట్స్ రావడంతో శంకర్‌పల్లిలోని లలిత ఆసుపత్రి వద్ద రోడ్డుపై పడ్డాడు. దాంతో ఆయన ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు.

పేకాట స్థావరంపై ఎస్వోటీ దాడి

● 8 మందిపై కేసు రూ.లక్ష, సెల్‌ఫోన్లు, ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం

ఆదిబట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న 8మందిని మహేశ్వరం ఏస్వోటీ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి, ఏస్వోటీ పోలీసులు కథనం మేరకు.. సాహెబ్‌గూడలోని నరసింహ వ్యవసాయ క్షేత్రంలో పేకాటడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్వోటీ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాటడుతున్న 9మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.లక్షా 4వేలు, 8సెల్‌ఫోన్లు, 2సెట్ల ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గణనాథుడి అనుగ్రహం అందరిపై ఉండాలి



కొత్తూర్ : పూజలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కొత్తూర్/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/మహేశ్వరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గణనాథుడి అనుగ్రహం ప్రజలందిరిపై ఉండాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీలోని సాయిచారి ఆధ్వర్యంలో ఏకదంత యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివచారి, అనిల్, కిరణ్, నాగేష్, సాయి, యూత్ సభ్యులున్నారు. వినాయక నవరాత్రోత్సవాలు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో గణేశ్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కడ్తాల మండలం మైసిగండిలో గణేశ్ మండపాల వద్ద తహసీల్దార్ ఆర్‌పీ జ్యోతిఅరుణ్ దంపతులు పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని మైసిగండి మైసమ్మ దేవాలయ ఫౌండర్‌ట్రస్టీ రామావత్ సిరోలి పంతూ ప్రారంభించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ సర్పంచ్ తులసీరామ్ నాయక్, నాయకులున్నారు. విఘ్నాలు తొలగిపోయి ప్రజలందరు విజయాలను పొందేలా చూడాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డితో కలిసి మహేశ్వరం, కందుకూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని వినాయక మండపాల్లో ప్రతత్యేక పూజలు చేశారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, సభ్యులు భాస్కర్‌రెడ్డి,



మహేశ్వరం : పూజలో కేఎల్లార్, భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, వైస్‌ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, నాయకులు కాకి ఈశ్వర్, లక్ష్మినారాయణగౌడ్, రాజునాయక్ ఉన్నారు.



కడ్తాల్ : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సిరోలిపంతూ

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

షాబాద్ : వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, ఎంపీడీవో అపర్ణ అన్నారు. శనివారం షాబాద్‌లోని పహిల్వాన్ చెరువును వారు పరిశీలించారు. చెరువులో నీరు ఎక్కువగా ఉండడంతో మహిళలు, పిల్లలను తీసుకురావద్దన్నారు. ఎస్ఐ రమేష్, కార్యదర్శి రాధాకృష్ణ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం : భీంభరత్

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 30(ఆంధ్యజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. అజీజ్‌నగర్‌లోని తన కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శనివారం స్థానిక నాయకులతో కలిసి ఆయన అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు తమ్మళి మాణయ్య, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ పార్టీ విభాగం మండలాధ్యక్షుడు భిక్షపతి, అజీజ్‌నగర్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గణేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్సీఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఆమనగల్లు : ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి 15వ ఆవిర్భావ దిన వేడుకలు శనివారం ఆమనల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ భవన్ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాయకులతో కలిసి కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కర్నె శ్రీశైలం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అంతకుముందు ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జెండాను ఆవిష్కరించారు. ఆమనగల్లు పట్టణంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. జిల్లా అధికార ప్రతినిధి నిరంజన్, ఆమనగల్లు మండల కన్వీనర్ యాదయ్య, నాయకులు దశరథం, యాదయ్య, మల్లేశ్, కృష్ణయ్య, జంగయ్య, భరత్, విఘ్నేశ్, తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా పట్ల అప్రమత్తంగా ఉండాలి

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రంగారెడ్డి జిల్లాలో సంచరిస్తున్న దొంగల ముఠా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. తమిళ, తెలుగు యాసలో మాట్లాడే నలుగురు సభ్యుల ముఠా తాము పోలీసులమని అమాయకులను నమ్మించి మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రజలను వారు ధరించిన బంగారు ఆభరణాలను ఎవరైనా ఎత్తుకెళతారని నమ్మించి బ్యాగులో పెడుతామని చెప్పి కాజేస్తారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తామే బట్టలో చుట్టి బ్యాగులో పెడతామని చెప్పి.. అందులో ఇతర వస్తువులు పెడతారని, మహబూబ్‌నగర్‌లో శనివారం రెండు దొంగతనాలు ఇదేవిధంగా చేసినట్లు వారు తెలిపారు. ఆ దొంగలు షాద్‌నగర్‌కు కూడా రావచ్చన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా నేడు(ఆదివారం) మండలంలోని లేమూరు, గూడూరులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. లేమూరు సబ్‌స్టేషన్ పరిధి అగర్‌మియాగూడ, బైరాగూడ, మిర్చిఫ్యాక్టరీ, నిషిత కాలేజీ, గూడూరు సబ్‌స్టేషన్ పరిధి గూడూరు, మాలగూడూరు, బండమీదగూడూరు, కటికపల్లి, అన్నోజిగూడ, తిమ్మాయిపల్లి, గ్రామాల పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఆమనగల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ ఫహీమ్ ఖాద్రిని శనివారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన కార్యాలయంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నాయకులు కాలె మల్లయ్య, బద్ది వెంకటేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

సమాజ సేవలో పాలుపంచుకోవాలి



పూజలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

తలకొండపల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక వారసత్వ, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ప్రతీఒక్కరు సమాజ సేవలో పాలు పంచుకోవాలని కోరారు. చుక్కాపూర్ సమీపంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వేద పాఠశాలను శనివారం రాఘవేందర్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి రూ.3లక్షల సాయమందిస్తానని ప్రకటించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ వెంకటేశ్వరశర్మ, నాయకులు తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఆమనగల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి పాండు అన్నారు. గౌరారం ప్రాథమిక పాఠశాలలో శనివారం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణలతో కలిసి ఎంఈవో పాండు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డిజిటల్ తరగతుల ఏర్పాటుకు ఎన్ఆర్ఐ కోట్ల సాయిబాబా రూ.10వేలు, సీతారామ్ రూ.10వేలు, వెంకట్‌రెడ్డి, పవన్‌కళ్యాణ్ రూ.10వేలు, పాండు గౌడ్ రూ.5వేలు, న్యాలపట్ల నరేందర్‌రెడ్డి రూ.15వేలు అందజేశారు.

సంక్షిప్తంగా..

కందుకూరు : గ్రామ పంచాయతీల్లో భౌగోళికంగా వార్డులవారీగా కొత్తగా డివిజన్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో సరిత, తహసీల్దార్ కె.గోపాల్‌లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీలకు గాను గతంలో ఉన్న వార్డులను కాకుండా కొత్తగా గ్రామంలో ఉన్న ఇళ్లను ఆధారంగా చేసుకొని భౌగోళికంగా డివిజన్‌లను చేసి వార్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

మహేశ్వరం : మండల పరిధిలోని తుమ్మలూరుకు చెందిన విధానకవి యాదగిరి(32) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతిచెందటం ఆయన కుటుంబానికి తీరని లోటని తుమ్మలూరు మాజీ సర్పంచ్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మద్ది కరుణాకర్‌రెడ్డి అన్నారు. తుమ్మలూరులో యాదగిరి భౌతిక కాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, మహబూబ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపాలిటీ జూనియర్ అసిస్టెంట్ మాదిరాజు మధుసూదన్‌రావు సేవలు మరువలేనివని మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు అన్నారు. శనివారం పదవీ విరమణ కార్యక్రమం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మధుసూదన్‌రావు సేవలను కొనియాడారు. అనంతరం పదవీ విరమణ పొందిన మధుసుధన్‌రావు ఆయన భార్య మంజులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

తలకొండపల్లి : పారిశుధ్య కార్మికుల మండల నూతన కమిటీ ఎన్నికలు మండల కేంద్రంలో నిర్వహించారు. సీఐటీయు జిల్లా నాయకులు పిప్పళ్ల శివశంకర్, గుమ్మడి కురుమయ్యల సమక్షంలో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా బేగరి యాదమ్మ, కార్యదర్శి బొర్ర జంగయ్య, సహాయ కార్యదర్శిగా రవనీల, ఉపాధ్యక్షులుగా చెన్నయ్య, జంగయ్య, కోశాధికారిగా నర్సింహలతో పాటు మరో 18మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సీఐటీయు నాయకులు సత్కరించారు.

శంషాబాద్ : దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మున్సిపల్ అధ్యక్షుడు సీజీ భాస్కర్, నాయకుడు రత్నంలు మాట్లాడారు. వికలాంగుల పింఛన్ రూ.4 వేల నుంచి రూ.6వేలకు పెంచాలని మంద కృష్ణ మాదిగ పోరాడుతున్నాడని గుర్తుచేశారు. ప్రభుత్వం ఇప్పటివరకూ స్పందించలేదని, పెంచకపోతే మందకృష్ణ మాదిగ చేబట్టబోయే వికలాంగుల గర్జనకు భారీగా జనాన్ని సమీకరిస్తామన్నారు. రఘు, రవి, నారాయణ తదితరులున్నారు.

ఆమనగల్లు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తి గత సహాయకుడు వెల్దండ జైపాల్‌రెడ్డిని ఆమనగల్లు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు పరామర్శించారు. జైపాల్ రెడ్డి తండ్రి రాంచంద్రారెడ్డి ఇటీవల మృతిచెందాడు. కుమారులు యాదవరెడ్డి, లక్ష్మారెడ్డి, జైపాల్ రెడ్డి, కూతురు అలివేలమ్మలను పరామర్శించారు.

పెన్షన్ విద్రోహ దినాన్ని జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు

యాచారం,. ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1వ తేదీన పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఉద్యోగ గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్స్ జేఏసీ కన్వీనర్ డాక్టర్ రామారావు తెలిపారు. ఈమేరకు శనివారం కలెక్టరేట్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు నిరసన తెలిపారు. బాగ్‌లింగంపల్లి ఆర్‌టీసీ కళ్యాణ మంటపంలో జరిగే సమావేశానికి భారీ ఎత్తున ఉద్యోగులు హాజరుకావాలని కోరారు. కాగా, పీఆర్‌టీయూటీఎస్ ఉపాధ్యాయులను, కార్మికులను తరలించడానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తుందని ఆ సంఘం నాయకుడు జగన్‌మోహన్ వెల్లడించారు.

సీపీఎం నాయకుల ముందస్తు అరెస్టు



ఇబ్రహీంపట్నం : పోలీసుల అదుపులో సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం/యాచారం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రామోజీ ఫిలిం సిటీలో ఇళ్ల స్థలాల విషయమై నగరానికి వెళ్తారనే సమాచారంతో ఇబ్రహీంపట్నంలో సీపీఎం నాయకులను పోలీసులు శనివారం ఉదయం ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామ్యేల్, మండల కార్యదర్శి సీ.హెచ్ బుగ్గరాములు, స్వప్న, బాల్‌రాజ్, పుష్ప, కాంతమ్మ, బాలమణి, మణెమ్మ, భారతమ్మ తదితరులున్నారు. అలాగే యాచారంలో సీపీఎం నాయకులను హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ, యాచారం పోలీసులు శనివారం ఉదయం 8 మందిని ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో ఆలంపల్లి నర్సింహ, బర్ల మల్లేష్, బ్రహ్మయ్య, దంతుక పెద్దయ్య తదితరులున్నారు. కాగా, అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం కందుకూరు మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ అన్నారు. ఈమేరకు అయన్ను కందుకూరు పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులు యూరియా కోసం ఆందోళన చేస్తున్నారని, నిరుపేదలకు దక్కాల్సిన ప్రభుత్వ భూములు కబ్జాదారులు ఆక్రమిస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా ఆరోపించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

కొత్తూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు చైర్‌పర్సన్ పీపీ కిట్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పీపీ కిట్లను అందజేస్తున్నామన్నారు. కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు నర్సింహగౌడ్, సోమ్లానాయక్, నాయకులు బి.యాదయ్య, పీర్లగూడెం గోపాల్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కార్మికులకు పీపీ కిట్లు అందజేసిన చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్‌యాదవ్